## ఇల్లందు–భూపాలపల్లి నూతన ఆర్టీసీ బస్సు సర్వీసును ప్రారంభించిన ఎమ్మెల్యే కోరం కనకయ్య

**దశ, ఇల్లందు:** ప్రయాణికుల సౌకర్యార్థం ఇల్లందు నుంచి భూపాలపల్లి వరకు నూతనంగా ప్రవేశపెట్టిన ఆర్టీసీ బస్సు సర్వీసును ఎమ్మెల్యే కోరం కనకయ్య శనివారం ప్రారంభించారు. ఇల్లందు బస్ స్టాండ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్టీసీ అధికారుల ఆహ్వానం మేరకు పాల్గొన్న ఎమ్మెల్యే నూతన బస్సుకు జెండా ఊపి సర్వీసును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ, ఇల్లందు-భూపాలపల్లి మార్గంలో ప్రయాణించే ప్రజలకు ఈ బస్సు సర్వీస్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు మరియు సాధారణ ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం, ఆర్టీసీ చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఆర్టీసీ అధికారులు మాట్లాడుతూ, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ నూతన సర్వీసును అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఈ బస్సు సర్వీస్ ద్వారా ఇరు ప్రాంతాల మధ్య ప్రయాణం మరింత సులభతరం కానుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, ఆర్టీసీ సిబ్బంది మరియు ప్రయాణికులు పాల్గొన్నారు.

## బైక్‌ను తప్పించబోయి లారీ బోల్తా



**దశ,అశ్వాపురం:-** మండల పరిధిలోని పాలవాగు సమీపంలోని సాయిబాబా గుడి వద్ద శుక్రవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు, ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించే క్రమంలో లారీ అదుపుతప్పి రహదారి పక్కన బోల్తా పడి చెట్టును ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు సంఘటన స్థలానికి చేరుకుని లారీలో చిక్కుకున్న వారిని బయటకు తీసేందుకు సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదంలో గాయపడిన వారి వివరాలు ఇంకా తెలియరాలేదు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు. సాయిబాబా గుడి సమీపంలో జరిగిన ఈ ప్రమాదంతో కొంతసేపు ఆ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

## ప్రతి ధాన్యపు గింజను రాష్ట్ర ప్రభుత్వం కొనాల్సిందే

❖ *బీఆర్ఎస్ నాయకులు*



**దశ, మణుగూరు:** రైతు పండించిన ప్రతి ధాన్యపు గింజను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మణుగూరులోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు కుంట లక్ష్మణ్ మాట్లాడారు. ఎన్నికల సమయంలో రైతులకు అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. యాసంగి ధాన్యం కొనుగోళ్లలో రైతులకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయని, ధాన్యం సకాలంలో కొనుగోలు చేయకపోవడం, రవాణా సమస్యలు, మిల్లర్ల వద్ద ఎదురైన ఇబ్బందులతో రైతులు నష్టపోయారని ఆరోపించారు. రైతుబంధు, రైతు సంక్షేమ పథకాల అమలుపై ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి చేసిన వ్యాఖ్యలపై కూడా వారు అభ్యంతరం వ్యక్తం చేస్తూ, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వ్యవహరించాలని సూచించారు. ఈ సమావేశంలో మాజీ జడ్పీటీసీ పోశం నరసింహారావు, ముత్యం బాబు, వట్టం రాంబాబు, అడపా అప్పారావు, ఎడ్ల శ్రీనివాస్, ముద్దంగుల కృష్ణ, అక్కి నరసింహారావు, తడికమల ప్రభుదాస్, వేల్పుల సురేష్, జావిద్ పాషా, తురక రామకోటి, వడ్లూరి రాంబాబు, వనమాల రాంబాబు, రావులపల్లి వెంకటేశ్వర్లు, బోసెట్టి రవి, గుర్రం సృజన్, జక్కం రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులను నట్టేట ముంచిన కాంగ్రెస్

❖ *పాత పద్ధతిలోనే యూరియా సరఫరా చేయాలి: బిఆర్ఎస్ డిమాండ్*



**దశ, పినపాక:** కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను అన్ని విధాల మోసం చేసి నట్టేట ముంచిందని బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పగడాల సతీష్ రెడ్డి ఆరోపించారు. ఆయన శనివారం బిఆర్ఎస్ కమిటీ పిలుపుమేరకు ఈ బయ్యారం అడ్డరోడ్లోని బిఆర్ఎస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రైతు ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఏ ఒక్క సహాయం కూడా చేయకుండా రైతులను నిండా ముంచిందని అంతేగాక, కేంద్రం ఇచ్చిన కోటమేరకే పంటలను కొనుగోలు చేస్తామని ఇప్పుడు ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందని ఆరోపించారు. రైతులు ఆరుగాలం పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయలేని దద్దమ్మ ప్రభుత్వం కాంగ్రెస్ అని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిర్వీర్యం చేసిందని అన్నారు. ఇప్పటికే రైతులు పండించిన ధాన్యానికి బోనస్ ఎగ్గొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు ఏడు రకాల వరి పంటలకే మన వేస్తామని ప్రకటించడం విడ్డూరంగా ఉందని అన్నారు. రైతులకు రైతు భరోసా పూర్తిగా వేయలేదని, రైతు బీమాను పూర్తిగా నిర్వీర్యం చేసిందని, రైతు రుణమాఫీని పట్టించుకోలేదని ఆరోపించారు. యూరియా యాప్ ను రద్దుచేసి పాత పద్ధతిలోనే రైతులకు యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యూరియా కోసం సర్కార్ యాప్ ను తీసుకువచ్చి రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ వర్మ, నాయకులు గుమ్మడి గాంధీ, భద్రయ్య, వాసు బాబు, సత్తిబాబు వెంకటరెడ్డి, రమేష్ ,జాంగిర్ చెన్నకేశవులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలనలో రైతులకు వెన్నుపోటు

❖ *చివరి గింజ కొనకపోతే జంగ్ సైరన్*
❖ *బీఆర్ఎస్ హెచ్చరిక*



**దశ బూర్గంపాడు:** దేశానికే వెన్నుముకగా ఎదిగిన తెలంగాణ రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం దారుణంగా వెన్నుపోటు పొడిచిందని, అన్నపూర్ణగా ఎదిగిన రాష్ట్రంలో అన్నదాతలను అనాథగా మార్చే దుర్మార్గానికి తెగబడిందని బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా మండిపడ్డారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, పినపాక మాజీ ఎమ్మెల్యే, రేగా కాంతారావు ఆదేశాల మేరకు సారపాక బిఆర్ఎస్ పార్టీ టౌన్ అధ్యక్షులు కొనకంచి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సారపాక లో పత్రిక సమావేశంను కొనకంచి శ్రీనివాసరావు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి తెలంగాణ ప్రజలకు రైతులకు ఎన్నో హామీలను చేసి అధికారంలోకి రాగానే అధికార అహంతో తెలంగాణ ప్రజలను రైతులను అన్ని విధాలుగా చేసిందంటూ మండిపడ్డారు.

**కాంగ్రెస్ మోసాలు రైతు ఆగం...**
పదేళ్లపాటు పండుగలా మారిన వ్యవసాయాన్ని మళ్లీ దండుగలా మార్చే కుట్ర చేస్తున్నాడు ఈ ముఖ్యమంత్రి" అని వారు ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల టైంలో రైతుబంధును 15 వేలకు పెంచుతామని, అన్ని పంటలు చివరి గింజ వరకూ కొని 500 రూపాయల బోనస్ చెల్లిస్తామని అబద్ధపు హామీలిచ్చారని విమర్శించారు. కానీ ఇప్పటివరకు రైతులను ఏమాత్రం ఆదుకోకుండా కళ్ళకు బుల్లి కబుర్లు చెబుతూ కాలయాపన చేస్తూ రైతుల కంట కన్నీరు మిగిల్చారని అన్నారు.

**ఉచిత విద్యుత్ ఏది..**
24 గంటల ఉచిత విద్యుత్ కు ఉరి వేయడానికి రైతుడిస్కంలను తెరపైకి తెచ్చారు. రైతు బీమాకు కనీసం ప్రీమియం కూడా చెల్లించకుండా 7600 మంది కుటుంబాలకు మొండిచెయ్యి చూపారు. పదేళ్లపాటు లేని యూరియా కొరతను సృష్టించి రైతులను వేధించారు. ఇన్ని కష్టాలు పడి పండించిన పంటను 60 రోజులపాటు కొనకుండా వేధించడంతో రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ఆత్మహత్య చేసుకునే దుస్థితి ఈ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందని అన్నారు. ప్రభుత్వ అసమర్థత వల్ల ఇప్పటికే వెయ్యి మంది రైతుల వరకూ ఆత్మహత్య చేసుకున్నారు" అని ఆవేదన వ్యక్తం చేశారు.

**వడ్లు కొనుగోలులో రకాల పెత్తనం..**
"2021లో పీసీసీ అధ్యక్షుడిగా రైతు దీక్షలో పది వేల కోట్లు ఇస్తే అన్ని పంటలు కొని చూపిస్తా అని చెప్పిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు ముఖ్యమంత్రిగా రైతులకోసం ఖర్చుచేసేందుకు పదివేల కోట్లు లేవా?" అని నిలదీశారు.



## నాటు సారాపై ఎక్సైజ్ శాఖ ఉక్కుపాదం

❖ *ఏడుగురిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసిన అధికారులు*

**దశ,పినపాక:** మండల వ్యాప్తంగా అక్రమంగా నాటు సారా విక్రయాలకు పాల్పడుతున్న వారిపై ఎక్సైజ్ శాఖ అధికారులు ప్రత్యేక దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా నాటు సారా విక్రయిస్తున్న ఏడుగురిని గుర్తించి అదుపులోకి తీసుకుని శనివారం తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి ఎదుట బైండోవర్ చేశారు. అక్రమ మద్యం విక్రయాలు, తయారీపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందని, ప్రజల ఆరోగ్యానికి హానికరమైన నాటు సారా వ్యాపారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని అధికారులు హెచ్చరించారు. మండల పరిధిలో నాటు సారా తయారీ, విక్రయాలపై నిరంతర నిఘా కొనసాగుతుందని తెలిపారు. ప్రజలు కూడా అక్రమ మద్యం విక్రయాలపై సమాచారం అందించి ఎక్సైజ్ శాఖకు సహకరించాలని అధికారులు కోరారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

## గుండాల పీహెచ్‌సీపై ఎమ్మెల్యే పాయం ఆకస్మిక తనిఖీ

❖ *వనిజ మరణ ఘటనపై వైద్యాధికారులను ప్రశ్నించిన ఎమ్మెల్యే*



**దశ, గుండాల:** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)ను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ నెల 14న చోటుచేసుకున్న చాట్ల వనిజ మరణ ఘటనపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ ఆసుపత్రి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా విధుల్లో ఉన్న వైద్యాధికారులు, వైద్య సిబ్బందిని ఘటనకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోగికి అందించిన వైద్య సేవలు, అత్యవసర చర్యలు, ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న సౌకర్యాలపై సమగ్ర సమాచారం సేకరించారు.

అనంతరం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్ఓ)తో ఫోన్‌లో మాట్లాడిన ఎమ్మెల్యే, గుండాల పీహెచ్‌సీకి అదనపు అంబులెన్స్ సౌకర్యాన్ని వెంటనే కల్పించాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులు ఇబ్బందులు ఎదుర్కోకుండా అవసరమైన అన్ని వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వైద్య సేవల్లో నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం ప్రదర్శించే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎమ్మెల్యే హెచ్చరించారు. పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత అని, రోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ముత్తయ్య, జిల్లా కార్యదర్శి కదిర్, వైద్యాధికారులు, ప్రభుత్వ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పినపాక యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎడమకంటి సుధాకర్ రెడ్డి నియామకం...



**దశ బూర్గంపాడు:** తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఇంచార్జి ఖలీద్ అహ్మద్, రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి ఆదేశాల మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గానికి నూతన నియామకం చేపట్టారు. పినపాక అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా యడమమకంటి సుధాకర్ రెడ్డిని నియమించారు. నాయకుల స్ఫూర్తిదాయక నాయకత్వంలో యువజన కాంగ్రెస్‌ను పటిష్టం చేసేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు.

**శక్తివంచన లేకుండా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తా: ఎడమ కంటి సుధాకర్ రెడ్డి**
తన మీద నమ్మకంతో తనకు అప్పగించిన బాధ్యతను తన శక్తి వంచన లేకుండా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని పినపాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ యువజన వర్కింగ్ ప్రెసిడెంట్ గానూతనంగా నియమితులైన ఎడమ కంటి సుధాకర్ రెడ్డి అన్నారు. నియోజకవర్గంలో శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు యువత ను పార్టీలో క్రియాశీలకంగా పనిచేసే విధంగా కృషి చేస్తానని అన్నారు. తనకు ఈ బాధ్యతను అప్పగించిన రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులకు, యువజన కాంగ్రెస్ ఈరాష్ట్ర ఇంచార్జి, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్కు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఉమ్మడి జిల్లా మంత్రులకు స్థానిక ఎమ్మెల్యేకు తన అభివృద్ధికి తన ఎదుగుదలకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## నకిలీ విత్తనాలపై కఠిన చర్యలు తీసుకోవాలి: సీపీఐ ఎంఎల్ మాస్ లైన్



**దశ, భద్రాచలం:** నకిలీ విత్తనాలతో రైతులను మోసం చేస్తున్న కంపెనీలు, ఎరువుల దుకాణాల నిర్వాహకులపై వ్యవసాయ శాఖ అధికారులు తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యుడు కె. రంగారెడ్డి డిమాండ్ చేశారు.

శనివారం భద్రాచలంలోని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో "బాండు" మొక్కజొన్న పేరుతో నకిలీ విత్తనాలను ఆదివాసీ రైతులు, పేద రైతులకు విక్రయించి తీవ్ర నష్టాలకు గురిచేస్తున్నారని ఆరోపించారు.

చర్ల మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన 21 మంది ఆదివాసీ రైతులకు ఒక వ్యాపారి బాండు మొక్కజొన్న విత్తనాలను విక్రయిస్తూ ఎకరానికి మూడు నుంచి నాలుగు టన్నుల దిగుబడి వస్తుందని నమ్మించాడని, అయితే పంట కోతకు వచ్చిన తర్వాత ఒక్క టన్ను దిగుబడి కూడా రాలేదని పేర్కొన్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో అమల్లో ఉన్న ఆదివాసీ చట్టాలను ఉల్లంఘిస్తూ ఇలాంటి మోసాలకు పాల్పడటం తీవ్రమైన నేరమని అన్నారు. ఈ ఘటనపై బాధిత రైతులు తహసీల్దార్, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు చేసినప్పటికీ అధికారులు స్పందించకపోవడం అన్యాయమని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నకిలీ విత్తనాల వ్యాపారులు, సంబంధిత కంపెనీలపై చర్యలు తీసుకోవడంతో పాటు నష్టపోయిన రైతులకు తగిన నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో బహుళజాతి కంపెనీల కార్యకలాపాలను నిషేధించాలని, బినామీ పేర్లతో నకిలీ విత్తనాల విక్రయాలు కొనసాగితే సహించబోమని హెచ్చరించారు. రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం స్పందించకపోతే పెద్దఎత్తున ఉద్యమాలు చేపడతామని తెలిపారు.

ఈ సమావేశంలో సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ జిల్లా నాయకురాలు కె. కల్పన, డివిజన్ నాయకులు దాసరి సాయన్న, మునిగేల శివప్రశాంత్, రమక్క, వెంకటేశ్వర్లు, శాంతక్క తదితరులు పాల్గొన్నారు.

## వర్షా కాల సవాళ్లకు నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ సన్నద్ధం



**దశ, నల్లగొండ :** రానున్న వర్షాకాలంలో భారీ వర్షాలు, నీటి నిల్వలు, డ్రైనేజీలు పొంగిపొర్లడం, చెట్లు కూలిపోవడం, రోడ్లు దెబ్బతినడం, తాగునీటి సరఫరా అంతరాయాలు, విద్యుత్ సమస్యలు వంటి అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ విస్తృత ఏర్పాట్లు చేసింది. మేయర్ ఆదేశాలు, మున్సిపల్ కమిషనర్ బి. శరత్ చంద్ర పర్యవేక్షణలో నగరవ్యాప్తంగా ప్రత్యేక మాన్సూన్ సన్నద్ధత చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ప్రజల భద్రత, ఆస్తుల రక్షణ మరియు అత్యవసర పరిస్థితుల్లో తక్షణ సహాయ చర్యల కోసం 24 గంటల మాన్సూన్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయడంతో పాటు నగరాన్ని టౌన్ 1, టౌన్ 2 ప్రాంతాలుగా విభజించి ప్రత్యేక రెస్క్యూ బృందాలను నియమించారు. వార్డు అధికారులు, శానిటరీ జవాన్లు, వాటర్ సప్లై సిబ్బంది, ఎలక్ట్రీషియన్లు, హరితహారం బృందాలు, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, శానిటేషన్ విభాగాల అధికారులు, సిబ్బంది సహా 150 మందికి పైగా ఈ బృందాల్లో పనిచేస్తున్నారు.

## జాతీయ లోక్ అదాలత్‌లో 147 కేసుల పరిష్కారం

❖ *రూ.1.15 లక్షల జరిమానా విధింపు: జడ్జి కంబపు సూరిరెడ్డి*




**దశ,మణుగూరు:** మణుగూరు న్యాయస్థానం పరిధిలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 147 కేసులు పరిష్కారమయ్యాయని జడ్జి కంబపు సూరిరెడ్డి తెలిపారు. పోలీసు, చెక్కు బాకీ, భరణం, గృహహింస, మద్యం నిషేధ శాఖలకు సంబంధించిన మొత్తం 2,199 కేసులు పెండింగ్‌లో ఉండగా, లోక్ అదాలత్ ద్వారా పలు కేసులకు పరిష్కారం లభించిందన్నారు.

పరిష్కారమైన కేసుల్లో 94 పోలీసు కేసులు, రెండు చెక్ బౌన్స్ కేసులు ఉన్నాయి. పోలీసు కేసుల్లో 42 కేసులు పరస్పర రాజీ ద్వారా ముగియగా, మరో 52 కేసుల్లో నిందితులు నేరాన్ని అంగీకరించడంతో న్యాయస్థానం రూ.1,15,000 జరిమానా విధించి కేసులను కొట్టివేసింది. రెండు చెక్ బౌన్స్ కేసులు కూడా ఇరుపక్షాల రాజీతో పరిష్కారమయ్యాయి.

అదేవిధంగా పెట్టి కేసుల్లో 385 కేసులు పరిష్కారమై రూ.2,16,000 జరిమానా వసూలు కాగా, ఈపెట్టి కేసుల్లో 213 కేసులు పరిష్కారమై రూ.24,700 జరిమానా విధించినట్లు వెల్లడించారు. ఇక బ్యాంకులకు సంబంధించిన ముందస్తు వివాద పరిష్కార విభాగంలో 55 కేసులు పరిష్కారమయ్యాయని, సంబంధిత బాకీదారులు మొత్తం రూ.30,27,800 చెల్లించడంతో కేసులు ముగిశాయని జడ్జి తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ ద్వారా వివాదాలకు త్వరితగతిన, సామరస్యపూర్వకంగా పరిష్కారం లభిస్తోందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.




## వివాహ వేడుకలో పాల్గొన్న తాటి వెంకటేశ్వర్లు



**దశ, అశ్వారావుపేట:** అశ్వారావుపేట మండలం బోరియాలగుట్ట గ్రామంలో నిర్వహించిన కుంజా మహేశ్వరరావు-రమాదేవి దంపతుల కుమారుడు వేణు వివాహ వేడుకలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, బూర్గంపహాడ్-అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర మాజీ ట్రైకార్ చైర్మన్ తాటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించిన తాటి వెంకటేశ్వర్లు వారికి నూతన వస్త్రాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. దాంపత్య జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో కొనసాగాలని ఆకాంక్షించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఆత్మీయంగా పలకరించి వారి క్షేమ సమాచారాన్ని తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తాండ్ర యుగేందర్, కోర్స ప్రతాప్ తదితర నాయకులు, గ్రామ పెద్దలు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

## పుట్టినరోజు సందర్భంగా వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం



**దశ,అశ్వాపురం:** సిరిశెట్టి కమలాకర్-సుజాత దంపతుల కుమారుడు శ్యామ్ కౌశిక్ పుట్టినరోజు సందర్భంగా అశ్వాపురంలోని ఆరిఫా అండ్ రోషిని వృద్ధాశ్రమంలో శనివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమంలోని వృద్ధులకు ప్రత్యేకంగా భోజనాలను ఏర్పాటు చేసి పంపిణీ చేశారు. పుట్టినరోజు వేడుకలను సామాజిక సేవా కార్యక్రమాలతో నిర్వహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. వృద్ధుల ఆశీస్సులు పొందడం ద్వారా జీవితంలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, వృద్ధాశ్రమ నిర్వాహకులు పాల్గొని శ్యామ్ కౌశిక్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. వృద్ధాశ్రమంలోని వృద్ధులు కూడా ఆయనకు ఆశీస్సులు అందజేశారు.

## ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం



**దశ,పినపాక:-** పినపాక మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామిరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ యోగా ఆసనాలను ప్రదర్శించి వాటి ప్రాముఖ్యతను వివరించారు. యోగ సాధన వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు ఏకాగ్రత, క్రమశిక్షణ పెంపొందుతాయని ఉపాధ్యాయులు తెలిపారు. విద్యార్థులు ప్రతిరోజూ యోగాను తమ దినచర్యలో భాగంగా చేసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి పలు యోగా ఆసనాలు నిర్వహించి యోగా దినోత్సవ సందేశాన్ని చాటిచెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని యోగా ప్రాధాన్యతపై అవగాహన పెంపొందించుకున్నారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది

## యోగ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు స్పోర్ట్స్ యూనిఫాంలు



**దశ,మణుగూరు:-** ప్రపంచ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకుని మణుగూరు మండలం రామానుజవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్పోర్ట్స్ యూనిఫాంలను పంపిణీ చేశారు. గ్రామస్తుల సహకారంతో సమకూర్చిన యూనిఫాంలను గ్రామ సర్పంచ్ కల్పన విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కల్పన మాట్లాడుతూ, విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంతో పాటు శారీరక దారుఢ్యాన్ని మెరుగుపర్చేందుకు క్రీడలు, యోగా ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. గ్రామస్తుల సహకారంతో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు యశోద మాట్లాడుతూ, విద్యార్థుల అభివృద్ధికి గ్రామస్తులు అందిస్తున్న సహకారం అభినందనీయమని పేర్కొన్నారు. యూనిఫాంల పంపిణీతో విద్యార్థుల్లో క్రీడల పట్ల మరింత ఆసక్తి పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. యూనిఫాంలు అందుకున్న విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తూ గ్రామస్తులకు, సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# వనజ మృతి ఘటనపై ప్రభుత్వం సీరియస్

- ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాలతో తక్షణ విచారణ
- విధులకు గైర్హాజరైన మెడికల్ ఆఫీసర్ సస్పెండ్
- వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం చేసిన మరో ముగ్గురిపై చర్యలు

**దశ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో:** గుండాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని శంభునిగూడెం గ్రామానికి చెందిన గర్భిణి శ్రీమతి కుంజా వనజ మృతి ఘటనను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత తీవ్రంగా పరిగణించింది. ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు ఘటనపై వెంటనే సమగ్ర విచారణకు ఆదేశాలు జారీ చేయడంతో పాటు, బాధ్యులపై కఠిన చర్యలు ప్రారంభించింది. శ్రీమతి కుంజా వనజ గుండాల పీహెచ్‌సీలో గర్భిణిగా నమోదు చేసుకుని మాతాశిశు ఆరోగ్య మార్గదర్శకాల ప్రకారం క్రమం తప్పకుండా గర్భధారణ పరీక్షలు చేయించుకున్నారు. జూన్ 13న పురిటి నొప్పులతో, అత్యంత క్లిష్ట పరిస్థితిలో పీహెచ్‌సీకి చేరుకున్న ఆమె మృత శిశువుకు జన్మనిచ్చారు. అనంతరం తీవ్రమైన రక్తస్రావం జరగడంతో వెంటనే ప్రాథమిక చికిత్స అందించి ఎల్లందు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు, అక్కడి నుంచి ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు అన్ని విధాలుగా చికిత్స అందించినప్పటికీ, తీవ్రమైన రక్తస్రావం కారణంగా హేమరేజిక్ షాక్, అనంతరం కార్డియాక్ అరెస్ట్ తో ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

### బాధ్యులపై కఠిన చర్యలు

ఆరోగ్యశాఖ మంత్రి ఆదేశాల మేరకు జూన్ 17న భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారితో ప్రాథమిక విచారణ నిర్వహించగా, సమాచార వ్యవస్థ, కేసు నిర్వహణ, రిఫరల్ ప్రక్రియలో కొన్ని లోపాలు ఉన్నట్లు గుర్తించారు. తీవ్రమైన రక్తహీనత (హిమోగ్లోబిన్ సుమారు 3 గ్రాములు) ఉన్న గర్భిణిని ముందుగానే గుర్తించి వైద్యాధికారికి సమాచారం అందించడంలో, సకాలంలో రిఫర్ చేయడంలో విఫలమైన ఆశా కార్యకర్త శ్రీమతి మొకల్ల లక్ష్మి, ఎ ఎన్ ఎం శ్రీమతి పి. ధనమ్మపై శాఖాపరమైన చర్యలు ప్రారంభించారు. ఘటన జరిగిన సమయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధుల్లో ఉన్న ఏఎన్ ఎం శ్రీమతి ఈ. జ్ఞానేశ్వరి వైద్యాధికారిని సంప్రదించకుండా ప్రసవం నిర్వహించడం, తీవ్ర రక్తస్రావం ఉన్నప్పటికీ రోగితో పాటు ఆరోగ్య సిబ్బందిని పంపించకపోవడం వంటి అంశాలను కూడా తీవ్రంగా పరిగణిస్తూ ఆమెపై శాఖాపరమైన చర్యలు చేపట్టారు. ఘటన జరిగిన కీలక సమయంలో విధులకు గైర్హాజరైన గుండాల పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ చి. సుదీప్ ను పూర్తి స్థాయి విచారణ పూర్తయ్యే వరకు సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నిజానిజాలు వెలికితీసేందుకు ఉన్నతస్థాయి కమిటీతో సమగ్ర విచారణ కొనసాగుతోంది . ఘటనపై అన్ని కోణాల్లో సమగ్ర విచారణ జరిపి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన చర్యలు సూచించేందుకు పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవీందర్ నాయక్, జాయింట్ డైరెక్టర్ (మాతాశిశు ఆరోగ్యం) డాక్టర్ సుధీర, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ రాథోడ్ తుకారామ్ , డి సీ హె చ్ డాక్టర్ జి. రవిబాబు సభ్యులుగా ఉన్న ఉన్నతస్థాయి బృందాన్ని ప్రభుత్వం నియమించింది. ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన మాతా శిశు ఆరోగ్య సేవలు అందించడం రాష్ట్ర ప్రభుత్వ అత్యున్నత ప్రాధాన్యత అని, విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించిన వారిపై ఎలాంటి ఉపేక్ష ఉండదని ప్రభుత్వం స్పష్టం చేసింది. అదే సమయంలో పూర్తి విచారణ నివేదిక వెలువడకముందే వాస్తవాలను వక్రీకరించి ప్రభుత్వ వైద్య వ్యవస్థపై ప్రజల్లో అపోహలు కలిగించే విధంగా ప్రచారం చేయడం సమంజసం కాదని ఆరోగ్య శాఖ పేర్కొంది.

## పినపాక కేజీబీవీలో గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం



**దశ,పినపాక :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాకలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) కళాశాలలో ఖాళీగా ఉన్న గెస్ట్ లెక్చరర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల స్పెషల్ ఆఫీసర్ వి. పద్మ తెలిపారు. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో పీజీ సీఆర్‌టీఐ మ్యాథమెటిక్స్1, పీజీ సీఆర్‌టీఐ కెమిస్ట్రీ1 పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. మొత్తం రెండు పోస్టులకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నివాసితులైన అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పీజీ సీఆర్‌టీఐ మ్యాథమెటిక్స్ పోస్టుకు పీజీ (మ్యాథమెటిక్స్), బీఈడీతో పాటు డిగ్రీలో మ్యాథమెటిక్స్ ఒక సబ్జెక్టుగా అభ్యసించి ఉండాలని తెలిపారు. అలాగే పీజీ సీఆర్‌టీఐ కెమిస్ట్రీ పోస్టుకు పీజీ (కెమిస్ట్రీ), బీఈడీతో పాటు డిగ్రీలో కెమిస్ట్రీ ఒక సబ్జెక్టుగా చదివి ఉండాలని పేర్కొన్నారు. మెరిట్ ఆధారంగా అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని, ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈ నెల 22 నుంచి 24వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు కళాశాల కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

# లోతువాగు రైల్వే ఓవర్ బ్రిడ్జి మరమ్మతు పనుల పరిశీలన

- ట్రాఫిక్ మళ్లింపుతో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎస్పీ ఆదేశం




**దశ,భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో :** లోతువాగు రైల్వే ఓవర్ బ్రిడ్జి మరమ్మతు పనులను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, ఐపీఎస్ సంబంధిత శాఖల అధికారులతో కలిసి శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మరమ్మతు పనుల పురోగతి, భద్రతా ప్రమాణాలు, ట్రాఫిక్ నిర్వహణ ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రిడ్జి మరమ్మతుల కారణంగా అమలు చేస్తున్న ట్రాఫిక్ మళ్లింపు మార్గాలను పరిశీలించిన ఎస్పీ, స్థానిక ప్రజలు, వాహనదారులు, ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రత్యామ్నాయ మార్గాల్లో తగిన సూచిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు ట్రాఫిక్ నియంత్రణ కోసం అవసరమైన పోలీసు సిబ్బందిని నియమించాలని సూచించారు. మరమ్మతు పనులు వేగంగా, నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని, పనుల సమయంలో భద్రతా చర్యలను కచ్చితంగా పాటించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజలకు ముందస్తు సమాచారం అందిస్తూ ట్రాఫిక్ అంతరాయం తగ్గించేలా సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. ఈ తనిఖీలో సంబంధిత శాఖల అధికారులు, పోలీసు అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత: ఎమ్మెల్యే పాయం



**దశ, గుండాల:** విద్యారంగ అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలంలో శనివారం విద్యాశాఖ అధికారులు, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, జూనియర్ కళాశాలల ప్రతినిధులతో సమగ్ర విద్యా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గత రెండు విద్యాసంవత్సరాల విద్యార్థుల ఉత్తీర్ణత శాతం, విద్యా ప్రమాణాలు, ఉపాధ్యాయుల ఖాళీలు, విద్యార్థుల నమోదు, పాఠశాలల మౌలిక సదుపాయాలు, భవనాల పరిస్థితి, తాగునీరు, మరుగుదొడ్లు, ఫర్నిచర్, విద్యుత్ సౌకర్యాలు, డిజిటల్ విద్యా వనరులపై విస్తృతంగా చర్చించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను బలోపేతం చేస్తూ ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. విద్యాసంస్థల్లో ఉన్న సమస్యలు, అవసరాలను అధికారులు నిర్భయంగా తెలియజేయాలని సూచించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు అవసరమైన ప్రతి అంశాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. సమావేశంలో పాల్గొన్న ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు తమ విద్యాసంస్థల అవసరాలు, అభివృద్ధి ప్రతిపాదనలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వాటిని ప్రాధాన్యత క్రమంలో పరిశీలించి దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. సమావేశంలో మండల విద్యాధికారి, విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, జూనియర్ కళాశాలల ప్రతినిధులు పాల్గొన్నారు.

# గాంధీభవన్‌లో కాంగ్రెస్ 'సత్యాగ్రహ దీక్ష'

- పాల్గొన్న డీసీసీ ప్రధాన కార్యదర్శి గండికోట కుమార్




**దశ ఓయూ :** ఏఐసిసి తెలంగాణ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్‌ను ఎలక్షన్ కమిషన్ తిరస్కరించడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు శనివారం గాంధీభవన్‌లో భారీ ఎత్తున 'సత్యాగ్రహ దీక్ష' చేపట్టాయి. కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం ఏకపక్ష వైఖరికి నిరసనగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. హైదరాబాద్ డీసీసీ ప్రెసిడెంట్ దీపక్ జాన్, సికింద్రాబాద్ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే, ఇంచార్జ్ ఆదం సంతోష్ ఆదేశాల మేరకు సికింద్రాబాద్ డీసీసీ ప్రధాన కార్యదర్శి మరియు వడ్డే ఓబన్న ఉత్సవ కమిటీ మెంబర్ గండికోట కుమార్ ఈ సత్యాగ్రహ దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ప్రతిపక్షాల అభ్యర్థులను లక్ష్యంగా చేసుకుని ప్రజాస్వామ్య విలువులకు విఘాతం కలిగిస్తూ నామినేషన్లను తిరస్కరించడం దుర్మార్గమని మండిపడ్డారు. ఎన్నికల కమిషన్ తీరుకు వ్యతిరేకంగా తమ నిరసనను శాంతియుత మార్గంలో కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొని తమ సంఘీభావాన్ని ప్రకటించారు.

## మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



**దశ,గుండాల:-** గుండాల మండలంలోని శంభునిగూడెం గ్రామానికి చెందిన చాట్ల వనిజ ఆకస్మిక మరణం పట్ల పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శనివారం మృతురాలి నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి ధైర్యం చెబుతూ, ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అలాగే ఈ ఘటనపై రాష్ట్ర ముఖ్యమంత్రి, ఆరోగ్య శాఖ మంత్రితో మాట్లాడి బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కోటాలో బాధిత కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించేందుకు కృషి చేస్తామని తెలిపారు. చాట్ల వనిజ మరణానికి సంబంధించిన ఘటనపై సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునేలా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 5వ వార్డులో విస్తృత పర్యటన.. పారిశుద్ధ్య సమస్యల పరిష్కారం



**దశ,మణుగూరు:** మణుగూరు మండలం సమితి సింగారం గ్రామపంచాయతీ పరిధిలోని 5వ వార్డులో సర్పంచ్ కలబోయిన మాధవరావు, ఉప సర్పంచ్ గాండ్ల సురేష్ ఆధ్వర్యంలో ప్రజా ప్రతినిధులు విస్తృతంగా పర్యటించి స్థానిక సమస్యలను తెలుసుకుని పారిశుద్ధ్య సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా వార్డు సభ్యురాలు శ్రీమతి కోలపిన్ని మానస, వార్డు సభ్యుడు వేర్పుల నరేష్‌తో కలిసి ప్రజల నుంచి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. గుర్తించిన సమస్యలను పారిశుద్ధ్య కార్మికుల ద్వారా వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. ప్రత్యేకంగా నిర్వహించిన పారిశుద్ధ్య కార్యక్రమంలో సర్పంచ్ కలబోయిన మాధవరావు స్వయంగా పార పట్టి శుభ్రత పనుల్లో పాల్గొనడం స్థానికుల ప్రశంసలు అందుకుంది. ఈ సందర్భంగా సర్పంచ్ మాధవరావు, ఉప సర్పంచ్ సురేష్ మాట్లాడుతూ, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని వార్డుల్లో కాలువలు, రహదారులను యుద్ధ ప్రాతిపదికన శుభ్రం చేస్తున్నామని తెలిపారు. పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమల నివారణ చర్యలు పాటించాలని సూచించారు. అలాగే ప్రభుత్వ వైద్యుల సూచనలను అనుసరిస్తూ ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పారిశుద్ధ్య సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.